PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :138 | పేజీలు : 8 | వెల రూ.5 | బుధవారం. 03.06.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh








సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాచరికం, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదని తెలిపారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజాప్రభుత్వమని పేర్కొన్నారు. తెలంగాణ విజన్–2047 లక్ష్యం సాధించే దిశగా తాము వెళ్తున్నామని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మంగళవారం పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండాను సీఎం ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ, రైతులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా తాము అడుగులు వేస్తున్నామని వెల్లడించారు. రైతులు అన్ని రకాల పంటలు పండించి తెలంగాణ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.

# ప్రజా ఆకాంక్షలు.. నెరవేరుస్తాం

## సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

### రైతులను పారిశ్రామికవేత్తలుగా, మహిళలను కోటీశ్వరులుగా చేస్తాం

రైతులు ఇతర పంటలపై దృష్టి పెట్టాలి.. ఈ ఏడాది నుంచి వరుసగా జాబ్ నోటిఫికేషన్లు ఇస్తాం

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్ట్‌కు ప్రాణం పోస్తాం.. తుమ్మిడి హట్టీ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం చర్చలు జరుపుతున్నాం

పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు.. రాష్ట్ర ప్రజలకు సందేశమిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం.. పరేడ్ గ్రౌండ్స్ లో సీఎం మాట్లాడారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ ప్రసంగం మొదలు పెట్టిన సీఎం.. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాల సక్సెస్ గురించి వివరించారు. తెలంగాణ కలను సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ కు, కృషి చేసిన సోనియాగాంధీకి ధన్యవాదాలు తెలిపారు. పుట్టుకనీది, చావునీది.. బతుకంతా దేశానిది అన్న కాళోజీ మాటలను గుర్తు చేసుకున్నారు. కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టిన నాటి నుంచీ రాష్ట్ర హితం కోసమే శ్రమిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్య మిస్తున్నామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని సంక్షేమ పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదని, ఎవరికి పట్టం కట్టాలో రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని పేర్కొన్నారు. ప్రభుత్వమంటే నలుగురి చేతిలో పెత్తనం కాదన్నారు.

**ఇకపై కొలువుల జాతర**

రాష్ట్రంలో ఇప్పటికే 1362 ప్రభుత్వ స్కూళ్లలో ప్రీ ప్రైమరీ తరగతుల్ని ప్రారంభించామని, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో బ్రేక్ ఫాస్ట్ ను అందిస్తున్నామని, జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనాన్ని అమలు చేశామని గుర్తుచేశారు. ఉద్యోగాల భర్తీ గురించి మాట్లాడుతూ.. న్యాయపరమైన సమస్యలు లేకుండా భర్తీ చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ఇప్పటివరకూ అత్యంత పారదర్శకంగా 67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, ఈ నెలలోనే TGPSC ద్వారా మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తాయని వెల్లడించారు. ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖలో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వస్తాయన్నారు. టౌన్ ప్లానింగ్, విద్యాశాఖలోనూ ఉద్యోగాల నోటిఫికేషన్లు వస్తాయని, ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సీఎం వెల్లడించారు.

**రైతే రాజు.. పారిశ్రామిక వేత్తల్ని చేయడమే లక్ష్యం**

30 నెలల పాలనలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించామన్నారు. 2047 విధానపత్రంలో రైతులకు ప్రాధాన్యమిచ్చామని, రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. రైతులకు ఒక్కొక్కరికి ఇప్పటి వరకూ రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. రూ.20,616 కోట్లు రైతుల ఖాతాల్లో వేసి, దాదాపు 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేశామని వివరించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తూనే, విద్యుత్తు పంప్ సెట్లకు సౌరశక్తితో నడిచే పంప్ సెట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. భరోసా పెట్టుబడి సాయం కింద ఇప్పటి వరకు రూ. 27 వేల 529 కోట్ల రూపాయలు నేరుగా రైతుల ఖాతాలలో వేశామని, గత ఏడాది వానాకాలం రైతు భరోసా పెట్టుబడి సహాయ పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.8 వేల 744 కోట్లను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. అలాగే.. ఈ ఏడాది ఇప్పటికే 5 వేల 700 కోట్ల రూపాయల రైతుభరోసా నిధులను నేరుగా రైతు ఖాతాలలో జమచేశామని, ఇది అన్నదాతల పట్ల మా చిత్తశుద్ధికి, వ్యవసాయం పట్ల మా ప్రాధాన్యతకు నిదర్శనం. 2025–26 అంచనాల ప్రకారం మన ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 236.87 లక్షల మెట్రిక్ టన్నులుగా నమోదైందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకంతో వరి, మొక్కజొన్న, పత్తి పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు.

**మహిళల్ని కోటీశ్వరుల్ని చేస్తాం..**

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ఆడబిడ్డల్ని పారిశ్రామిక వేత్తలుగా మార్చేందుకు రూ.లక్షకోట్ల రుణాలిస్తామని సీఎం ప్రకటించారు. రాష్ట్ర మహిళలు దేశానికే ఆదర్శంగా మారారని, ఇప్పటికే రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను అందజేశామని చెప్పారు. ఉచిత బస్సు పథకంతో ఇప్పటి వరకూ మహిళలు రూ.10 వేల కోట్ల విలువైన ప్రయాణాలు చేశారని సీఎం చెప్పారు.

# కావాలంటే అరెస్ట్ చేసుకోండి.. మమతా బెనర్జీ

పశ్చిమబెంగాల్, ప్రభాత సూర్యుడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో



చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై దాడిని వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో ధర్నా చేపట్టనున్నారు. అయితే, దీదీ ధర్నాకు అనుమతిచ్చేందుకు పోలీసులు నిరాకరించారు. ఈ క్రమంలో మమత మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అనుమతి ఇవ్వకున్నా ధర్నా నిర్వహిస్తామని.. కావాలంటే తనను అరెస్టు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో పోస్టు చేశారు. భాజపా అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రం మునపటిలా లేదని.. ప్రజలు భయంతో, ఆందోళనతో ఉంటున్నారని మమత ఆరోపించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం నాయకులు పార్టీని వీడితే.. అది సంస్థ పునర్నిర్మాణానికి సాయపడుతుందన్నారు. దీనినుంచి టీఎంసీ మరింత బలంగా పుంజుకుంటుందన్నారు. పోలీసుల అనుమతి లేకపోయినా ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అరెస్టు అయ్యేందుకు కూడా తాను సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. పోలీసులు ఒక రాజకీయ పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు.

# తెలంగాణలో 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష..

హైదరాబాద్: ప్రభాత సూర్యుడుతెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది. ఖైదీలు ఇవాళ జైళ్ల నుంచి విడుదల కానున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు.




విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి ఇవాళే నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకు న్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. అలాగే విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విడుదల పొందిన వారు బాధ్యతాయుతంగా జీవించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటే.. జైళ్ల శాఖ చేసిన కృషి ఫలించినట్లవుతుందని సౌమ్యా మిశ్రా పేర్కొన్నారు.

# తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందాం: పవన్ కల్యాణ్

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు: తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరపున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని



గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007–08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు. తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు. తనకు వారాహి యాత్రకు అనుమతి ఇచ్చింది తెలంగాణ అని వ్యాఖ్యానించారు. వైసీపీ తనను ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టనివ్వనంటే ఈ ప్రాంతం ఆదరించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే తాను అధికారం కోరుకోలేదన్నారు. అలాంటిది తెలంగాణలో ఎందుకు కోరుకుంటానని ఆయన ప్రశ్నించారు.

# జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు బొంగునూరు శ్రీనివాస్ రెడ్డి**





మేడ్చల్ ప్రభాత సూర్యుడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు బొంగునూరు శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా అభివృద్ధి మరింత వేగవంతమైందని తెలిపారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, ఉపాధి కల్పన వంటి కీలక రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, పలువురు ప్రముఖులు పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# అమరుల త్యాగాల ఫలమే నేటి తెలంగాణ: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



ప్రభాత సూర్యుడు /నల్లగొండ ప్రతినిధి :తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నల్లగొండలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన మంత్రి, వారి త్యాగాల ఫలితంగానే నేటి తెలంగాణ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఉద్యమ చరిత్రలో నల్లగొండ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని, ఇది విప్లవాల పురిటిగడ్డగా నిలిచిందన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి వివరాలు వెల్లడిస్తూ, రబీ ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. 7.24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ. 1223.88 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా

రూ. 508.85 కోట్ల మేర లబ్ధి చేకూరిందని, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కింద 2.52 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందాయని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ కింద 2.33 లక్షల మంది రైతులకు రూ. 2004.83 కోట్ల ఉపశమనం కల్పించినట్లు వెల్లడించారు. గృహజ్యోతి పథకం ద్వారా 2.51 లక్షల కుటుంబాలకు జీరో విద్యుత్ బిల్లులు అందుతున్నాయని, ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద తొలి విడతలో 18,837 ఇండ్లు మంజూరు చేయగా రెండో విడతలో మరో 2 వేల ఇండ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. డిండి, ఎస్ఎల్‌బీసీ, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు భారీ నిధులు కేటాయించిన ప్రభుత్వం, జిల్లాలో రహదారుల అభివృద్ధికి రూ. 1457 కోట్లకు పైగా మంజూరు చేసిందని చెప్పారు. యువత ఉపాధి అవకాశాల కోసం నల్లగొండలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభించామని వెల్లడించారు.

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో బి.ఫార్మసీ, లా కోర్సులకు అనుమతులు లభించాయని, ఆరోగ్యశ్రీ పరిమితిని

రూ. 10 లక్షలకు పెంచడంతో వేలాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో నాలుగు యూనిట్లు పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించినట్లు తెలిపారు.

# నల్లగొండలో రాజకీయ వేడి పెంచిన E-Classes యాప్ ఆవిష్కరణ




ప్రభాత సూర్యుడు / నల్లగొండ ప్రతినిధి:నల్లగొండలో నిర్వహించిన జు-జశ్రీఖంంవం యాప్ ఆవిష్కరణ కార్యక్రమం రాజకీయ వేదికగా మారింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ ముఖ్య నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల భూపాల్ రెడ్డి, యువ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఒకే వేదికపై ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో పరిశ్రమలు, వ్యవసాయం, విద్యుత్, సాగునీటి రంగాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ, భారీ సాగునీటి ప్రాజెక్టులు కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం పోరాటాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నేత కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వ కాలంలో లక్షలాది ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. యువ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, యువతకు అండగా నిలిచేందుకే జు-జశ్రీఖంంవం యాప్ ను తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర స్థాయి పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్, ఆన్‌లైన్ తరగతులు, మార్గదర్శక సమాచారం ఒకే వేదికపై అందుబాటులో ఉంటాయని వివరించారు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ, గత ఎన్నికల్లో యువతను ఉద్యోగాల పేరుతో ఆకర్షించిన నాయకులు ఇప్పుడు కనిపించడం లేదని విమర్శించారు. ప్రస్తుతం ఇస్తున్న నియామక పత్రాలు కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ల ఆధారంగానే జరుగుతున్నాయని పేర్కొన్నారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో ప్రభుత్వం లేదని విమర్శిస్తూ, నల్లగొండ జిల్లా అభివృద్ధికి మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి చేసిన కృషిని ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు జిల్లాలో రాజకీయ చర్చకు దారితీశాయి. అదే సమయంలో నిరుద్యోగ యువత కోసం రూపొందించిన జు-జశ్రీఖంంవం యాప్ ఆవిష్కరణ కూడా విశేష ప్రాధాన్యత సంతరించుకుంది.

# నాగోల్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

పెద్ద అంబర్‌పేట్ -- ప్రభాత సూర్యుడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగోల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ. సంపత్ జాతీయ జెండాను ఆవిష్కరించి అధికారులకు, సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు.



ఈ కార్యక్రమంలో ఏయంసిలు కిరణ్ కుమార్, నర్సింహులు, హరి కుమార్, సాయిక్రిష్ణ, రమాదేవి మరియూ వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్ సర్కిల్లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బడంగ్‌పేట్ -- ప్రభాత సూర్యుడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని, ముఖ్యంగా ఎస్ఐఆర్, జనగణన వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో రాఘవేంద్ర, ఏఎంఓహెచ్ ప్రవీణ్ కుమార్, డీఈ అభినయ్ కుమార్, ఏఈ హరీష్, ఏఈ గంగాప్రసాద్, ఏఎంసీ స్వప్న, సీనియర్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బాటసింగారం పండ్ల మార్కెట్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

అబ్దుల్లాపూర్ మెట్ -- ప్రభాత సూర్యుడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అమరుల ఆశయాల సాధన కోసం రాష్ట్ర పునర్నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర చారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు మేకం లక్ష్మి, అంజయ్య, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, బండి మధుసూదన్ రావు మరియూ మార్కెట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# నల్లగొండలో వాతావరణం మార్పు.. ఎండలకు బ్రేక్



ప్రభాత సూర్యుడు/ నల్లగొండ ప్రతినిధి :మూడు రోజులుగా మండిపోతున్న ఎండలకు నల్లగొండలో ఒక్కసారిగా బ్రేక్ పడింది. సాయంత్రం వేళ వాతావరణం పూర్తిగా మారిపోయి, మేఘావృతమైన ఆకాశంతో పాటు ఈదురుగాలులు వీయగా వర్షం కురిసింది. దీంతో ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. గత కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోయిన ప్రజలు, వర్షం కురవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీలు వర్షపు చినుకులతో తడిసి ముద్దయ్యాయి. వర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆహ్లాదకరమైన సాయంత్రాన్ని ఆస్వాదించారు. మరోవైపు రైతులు కూడా ఈ వర్షాన్ని స్వాగతించారు. వ్యవసాయ పనులకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం నల్లగొండలో వర్షం కొనసాగుతుండగా, వాతావరణం పూర్తిగా ఆహ్లాదకరంగా మారింది.

# ఏజెన్సీ దళితుల హక్కులను కాలరాసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం!

**జూన్ 5న 'మంత్రి దామోదర'తో చర్చా వేదిక ద్వారా న్యాయం సాధిస్తాం**

**అధిక సంఖ్యలో తరలిరావాలి: బొమ్మెర శ్రీనివాస్ పిలుపు**



కొత్తగూడెం జూన్ 3 (ప్రభాత సూర్యుడు) గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లోని దళితులకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను పూర్తిగా లేకుండా చేసి, వారిని తీవ్ర అన్యాయానికి గురిచేసిందని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ తీవ్రంగా ధ్వజమెత్తారు.ఏజెన్సీ దళితుల హక్కుల పునరుద్ధరణే ధ్యేయంగా జూన్ 5న తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ప్రత్యేక చర్చా వేదికను ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు.కొత్తగూడెంలోని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 5న (శుక్రవారం) ఉదయం 11 గంటలకు హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో ఈ కీలక సమావేశం జరగనుందని వెల్లడించారు.పదేళ్ల పాలనలో తీరని వివక్ష.. నలిగిపోయిన దళిత బతుకులు!గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ దళితులు పడిన ఇబ్బందులను క్లుప్తంగా వివరించారు.హక్కులు దూరం: గత పదేళ్ల పాలనలో ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎస్సీ కులాల స్థానిక రిజర్వేషన్లపై తీవ్ర నిర్లక్ష్యం వహించి, వారి నోళ్లు కొట్టారు.భూ హక్కుల అపహరణ: తరతరాలుగా నమ్ముకుని సాగు చేసుకుంటున్న భూములపై దళిత రైతులకు ఎలాంటి యాజమాన్య హక్కులు లేకుండా చేసి, వారిని భూమి లేని నిరుపేదలుగా మార్చారు.ఆర్థిక ఇబ్బందులు: ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక, సాగు భూములపై హక్కులు కోల్పోయి ఏజెన్సీ దళితులు నరకప్రాయమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు.గత ప్రభుత్వం చేసిన ఈ చారిత్రక తప్పిదాలను సరిదిద్ది, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా న్యాయం పొందేందుకే ఈ ఉన్నత స్థాయి చర్చా వేదికను నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.మంత్రుల సమక్షంలో కీలక చర్చ..ఈ మహా సభలో ముఖ్య అతిథిగా పాల్గొనే మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు, ఎస్సీ, ఎస్టీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక వెంకటస్వామి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి గారి ప్రియతమ్ తదితరులు పాల్గొని సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.పోరాట సమితి పిలుపు:గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలియైన ఏజెన్సీ దళితుల హక్కులను తిరిగి సాధించుకోవడానికి, ఈ చర్చా వేదికను ఒక పెద్ద ఉద్యమంగా మార్చాలని.. ఏజెన్సీ జిల్లాల్లోని షెడ్యూల్డ్ కులాల ప్రజలు, మేధావులు, యువకులు జూన్ 5న హైదరాబాద్‌కు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బొమ్మెర శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడ రమేష్, అభ్యుదయ కళా సమితి చింతల కనకయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సిలుమల గోపి కిరణ్, సలిగంటి కొమరయ్య, ఎనగంటి శ్రీను, సిద్ధల వెంకటరావు, ప్రకాష్ రాజు,

# ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహప్రవేశంలో పాల్గొన్న ఎంపీడీవో.



సింగరేణి జూన్ 02 ప్రభాత సూర్యుడు సింగరేణి మండలంలోని గేటుకారేపల్లి, రేగులగూడెం, భాగ్యనగర్‌తండా గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుల గృహప్రవేశాలను మంగళవారం నిర్వహించారు. గేటుకారేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సర్పంచ్ పూసం ఎల్లయ్యలు రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇండ్ల ప్రవేశాషలు చేయించారు. రేగులగూడెంలో సర్పంచ్ ఈసం మోతీరస్వామి, డైరక్టర్ అడ్డగోడ ఐలయ్యలు కొబ్బరికాయలు కొట్టి గృహప్రవేశాలు చేయించారు. భాగ్యనగత్‌తండాలో సర్పంచ్ బానోత్ హీరాలాల్ లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు.ఈకార్యక్రమంలో గుడిపుడి ట్రస్ట్ చైర్మన్ గుడిపుడి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సంబురాలు.

సింగరేణి జూన్ 02 ప్రభాత సూర్యుడు తెలంగాణ అవిర్భావ సంబురాలు సింగరేణి మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంఆర్‌సీలో ఎంఈవో జయరాజు, పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ బీ. సురేష్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై బైరు గోపి, సొసైటీ కార్యాలయంలో చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, అన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌లు మువ్వన్నల జెండాను ఎగరవేశారు. భాగ్యనగర్‌తండాలో చదువులలో ప్రతిభ చూపిన విద్యార్థులను సర్పంచ్ బానోత్ హీరాలాల్ సన్మానించారు. సింగరేణి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్(టోనీ) మామిడితోరణాలతో అలంకరింపచేసి పండుగల వాతావరణాన్ని తెచ్చారు. వార్డు సభ్యులు మేకల కుమార్‌స్వామి తనయ లాస్య పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.




# గిరిజన గుండె రగిలింది..

# పాలక, అధికార వర్గాల వెన్నులో వణుకు పుట్టింది!

**19 ఏళ్ల పోరాటం .. నిమ్మకు నీరెత్తిన రాజకీయ నాయకులు!**

**పోరాటంతో 'సీతారామ'ను స్తంభింపజేసిన ఆదివాసీలు!**



అశ్వారావుపేట జూన్ 3 ప్రభాత సూర్యుడునిరుపేద గిరిజనుడి నోటి కాడి కూడు లాక్కోవడం, వారి భూములను అప్పనంగా దోచుకోవడం ప్రభుత్వాలకు, ఇక్కడి రాజకీయ నాయకులకు ఎంత అలవాటుగా మారిందో చెప్పడానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట మండలంలో జరుగుతున్న భూసేకరణ పర్వమే సజీవ సాక్ష్యం. అమాయక గిరిజన రైతులను దశాబ్దాలుగా మోసం చేస్తున్న పాలకుల, అధికారుల కళ్ళు బైర్లు కమ్మేలా ఊట్లపల్లి, రామున్నగూడెం, నల్లబాడు, వేదాంతపురం, మల్లాయిగూడెం, దబ్బతోగు ప్రాంతాల ఆదివాసీలు రణభేరి మోగించారు. రాజకీయ నాయకులు చేతకానివాళ్లలా మిగిలిపోయిన చోట.. గిరిజన రైతులు తామే సైనికులూ, తామే నాయకులై 19 ఏళ్ల సుదీర్ఘ అన్యాయంపై తిరుగుబాటు జెండా ఎగరేశారు.రాజకీయ నేతల 'లాలూచీ'.. అడుగడుగునా దగా!?2005 డిసెంబర్ 31న వెంకమ్మ చెరువు వరద కాలువ పనులకు శంకుస్థాపన జరిగిన నాటి నుంచి నేటి వరకు.. అంటే దాదాపు 19 ఏళ్లుగా 120 మంది పేద గిరిజన రైతులు తమ జీవనాధారమైన భూములను కోల్పోయి రోడ్డున పడ్డారు. ఈ సుదీర్ఘ కాలంలో ఈ ప్రాంతంలో ఎందరో ఎమ్మెల్యేలు, మంత్రులు మారారు, రకరకాల జెండాలు ఊపారు. కానీ ఏ ఒక్క రాజకీయ నాయకుడికి కూడా ఈ 120 మంది గిరిజన కుటుంబాల ఆకలి కేకలు వినపడలేదు.ఓట్ల వేటలో ఉన్న శ్రద్ధ.. పరిహారంలో లేదా? ఎన్నికలు రాగానే గిరిజన గూడేలపై పడి ఓట్లడిగే నాయకులు, తమ భూములు పోయి రైతులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతుంటే కనీసం అధికారులను ప్రశ్నించే ధైర్యం చేయలేదు.?ప్రాజెక్టుల కాంట్రాక్టులు, కమిషన్లపై ఉన్న శ్రద్ధ.. భూములు కోల్పోయిన గిరిజనులకు న్యాయబద్ధంగా రావాల్సిన నష్టపరిహారం ఇప్పించడంలో ఏ కోశానా కనిపించలేదు.అధికారుల అహంకారం.. పాత చట్టాల పేరుతో పగటి దొంగతనం!?మరోవైపు ప్రభుత్వ అధికారులు గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని రాక్షస ఆనందాన్ని పొందారు. 2026 నడుస్తున్న ఈ కాలంలో కూడా.. 2005 నాటి పాత చట్టం ప్రకారం నామమాత్రపు రేట్లు ఇస్తామంటూ రైతులను మానసిక క్షోభకు గురిచేశారు.?"
బజారున పడ్డ గిరిజన రైతుల పట్ల మానవత్వం చూపాల్సింది పోయి, 'పాత రేట్లే ఇస్తాం, తీసుకుంటే తీసుకోండి లేదంటే లేదు' అనే రీతిలో అధికారులు వ్యవహరించడం వారి అహంకారానికి, నిర్లక్ష్యానికి పరాకాష్ట."తి
రగబడ్డ గిరిజనం.. 'సీతారామ' ప్రాజెక్టుకు బ్రేక్!?అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల నయవంచనపై గిరిజన రైతులు ఈసారి అస్త్రం మార్చారు. తమను యాచకులుగా మార్చిన వ్యవస్థపై సింహాల్లా గర్జించారు. ప్రతిష్టాత్మక 'సీతారామ' ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణ కోసం అధికారులు అట్టహాసంగా నిర్వహించిన గ్రామసభలను రైతులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.?"పాత వరద కాలువ బాధితులకు 2013 చట్టం ప్రకారం నేటి మార్కెట్ విలువతో నష్టపరిహారం చెల్లించే వరకూ.. కొత్త ప్రాజెక్టులకు ఇంచు భూమి కూడా ఇచ్చే ప్రసక్తే లేదు!"?అంటూ గిరిజన మహిళలు, రైతులు సాహసోపేతంగా అధికారుల వాహనాలను అడ్డుకున్నారు. గంటల తరబడి ఎండను సైతం లెక్కచేయకుండా రోడ్లపై బైఠాయించి నిరసనలు తెలిపారు. నాయకులు అమ్ముడుపోయినా,తాము లొంగేది లేదని ఆదివాసీలు చాటిచెప్పారు.గిరిజన గళానికి తలవంచిన యంత్రాంగం?గిరిజన రైతుల ఈ ఉధృతమైన పోరాటం, అణచలేని తిరుగుబాటు చూసి ప్రభుత్వ యంత్రాంగం ఒక్కసారిగా వణికిపోయింది. ఎప్పుడూ ఏసీ గదుల్లో కూర్చునే అధికారులు, కలెక్టర్ స్పందించి నేడు ప్రత్యేక చర్చలు జరపక తప్పలేదు. గిరిజన రైతుల పట్టుదల, ఐక్యత ముందు మోకరిల్లిన అధికారులు ప్రస్తుత మార్కెట్ విలువను బట్టి నూతన రేట్లను ప్రతిపాదించారు. దీనికి రైతులందరూ పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇది రాజకీయ నాయకుల విజయం కాదు.. కేవలం గిరిజన రక్తం, చెమట చిందించి సాధించుకున్న విజయం!?ఈరోజు (జూన్ 2) ఈ ప్రాంతానికి రాష్ట్ర మంత్రి వస్తున్నారు.
రాజకీయ నేతలు కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా.. అధికారులు ఖరారు చేసిన నూతన రేట్ల ప్రకారం గిరిజన రైతుల ఖాతాల్లో తక్షణమే పైసా పైసాతో సహా పరిహారం జమ చేయాలి. శాశ్వత పరిష్కారం చూపాలి. లేనిపక్షంలో ఈ గిరిజన గర్జన సచివాలయాన్ని సైతం కదిలిస్తుందని హెచ్చరిస్తోంది.

# పచ్చిరొట్ట విత్తనాలు పంపిణి చేస్తున్న సొసైటీ పాలకవర్గం

సింగరేణి జూన్ 02 ప్రభాత సూర్యుడు. సొసైటీ ద్వారా రైతులకు అందుబాటులో ఉంచిన పచ్చిరొట్ట



విత్తనాలను మంగళవారం చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు పంపిణిని ప్రారంభించారు. సొసైటీలో జీలుగు, జనుములు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ తెలిపారు. సబ్సిడీ పోను జీలుగు 30 కేజీల బ్యాగు రూ. 2460, జనములు 40 కేజీల బ్యాగు రూ.3110 లకు ఇవ్వటం జరుగుతుందన్నారు. కావల్సిన రైతులు మండల వ్యవసాయశాఖ లో కూపన్లు తీసుకోని సొసైటీ కార్యాలయాన్ని సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బొల్లు హనుమంతరావు, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, మర్సకట్ల రోశయ్య, కొత్తూరు రామారావు, మధ్యాహ్నపు శ్రీను తదితరులు పాల్గొన్నారు

# కారేపల్లి గ్రామపంచాయతీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు.

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సర్పంచ్ మేదరి టోనీ.**

సింగరేణి జూన్ రెండు ప్రభాత సూర్యుడుకారేపల్లి గ్రామపంచాయతీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని అందించిన తెలంగాణ తల్లి సోనియా గాంధీ నీ ఈ సందర్భంగా స్మరించుకుంటూ తెలంగాణ ఇచ్చిన తెచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమ ముందుకు సాగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించే ప్రతి సంక్షేమ పథకాలు అర్హులకు వర్తిస్తాయని అన్నారు. అమరుల త్యాగ ఫలితం తెలంగాణ ఏర్పాటులు వారి కృషి మరువ లేనిదని వారిని స్మరించుకోవడం బాధ్యతగా ప్రతి ఒక్కరు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టోనీ, ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి,కార్యదర్శి నెహ్రు, వార్డు సభ్యులు అంజయ్య, రాధ, సరోజ, కుమార్, సర్దార్, రాజశేఖర్, విజయ్ , యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



# దేవరయాంజాల్‌లో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు.





తూముకుంట ప్రభాత సూర్యుడు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్పరిధిలోని కీసర సర్కిల్, శామీర్‌పేట్ డివిజన్‌లోని దేవరయాంజాల్ గ్రామంలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించిన సోనియా గాంధీ కి కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.దే సందర్భంగా దేవరయాంజాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బాలేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.అలాగే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి గారు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ టి.శంకర్ గౌడ్,శ్రీ సీతా రామ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పి.లక్ష్మీనారాయణ,మాజీ ధర్మకర్తలు వి.మురళి గౌడ్,యన్.ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# 'పెద్ది' ఈవెంట్స్:
# 'ఫ్లో'లో మాట జారితే ఎందుకింత రాద్ధాంతం?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన సినిమా -పెద్ది-ని పీక్స్ లో ప్రమోట్ చేస్తున్న సంగతి తెలిసిందే. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన సినిమా -పెద్ది-ని పీక్స్ లో ప్రమోట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఉత్తరాది, దక్షిణాదిలో కీలక నగరాలన్నిటినీ చుట్టేసారు. మొన్న భోపాల్ (మధ్యప్రదేశ్), నిన్న విజయవాడ (ఆంధ్రప్రదేశ్) ఈవెంట్లలో అతడి ఈవెంట్ కి ఊక వేస్తే రాలనంతమంది ఫ్యాన్స్ పోటెత్తారు. అయితే ఇంత పెద్ద ఈవెంట్లలో చరణ్ చాలా అరుదుగా, పొరపాటున నోరు జారినందుకు ట్రోలర్స్ యథావిధిగా విమర్శించడం మొదలు పెట్టారు. నెట్టింట వైరల్‌గా మారిన కెవిన్! రామ్ చరణ్ ఇప్పటికే రెండుసార్లు తన మాట జారారు. అయితే అది కావాలని చేసినదా? -పెద్ది- సినిమా ప్రమోషనల్ ఈవెంట్లలో ఎంతో ఎమోషనల్ అవుతున్న చరణ్ ఫ్లోలో మాట్లాడేప్పుడు పొరపాటున మాట జారారని అందరికీ లైవ్ గా చూస్తున్నవారికి అర్థమవుతూనే ఉంది. అయినా ట్రోలర్లు మాత్రం తమ పని మానలేదు.. చరణ్ ని టార్గెట్ చేసన్తూనే ఉన్నారు. ఇంతకుముందు భోపాల్ ఈవెంట్లో టీమిండియా ఫేసర్ బుమ్రా గురించి మాట్లాడుతూ పొరపాటున -ఫుట్ బాల్ ఆటగాడు- అని అన్నారు. అతడికి అభిమానిని అని చెబుతూనే ఆయన ఈ మాట అనడం బుమ్రా అభిమానుల హృదయాలను గాయపరిచిన మాట వాస్తవమే అయినా.. అక్కడ సందర్భం ఏమిటి? ఎందుకు రామ్ చరణ్ తడబడ్డారు? అన్నది కూడా గమనించడం చాలా ముఖ్యం. మధ్యప్రదేశ్ లాంటి చోట్ల తన ప్రాంతానికి సంబంధం లేని మనుషుల మధ్య అంతమందిని చూసి ఎంతో ఎమోషనల్ అయిపోయిన చరణ్ పొరపాటున ఒకసారి -బీహార్ వాసులు- అనేసారు.. మరోసారి -బుమ్రా ఫుట్ బాల్ ఆటగాడు-! అంటూ నోరు జారడంతో చాలా రాద్ధాంతమే చేసారు ట్రోలర్లు. అయినదానికి కానిదానికి ట్రోలింగ్ చేస్తూ వినోదం పొందడం ఈ డిజిటల్ యుగంలో నిత్యం చూస్తున్నదే అయినా అక్కడ సమయం సందర్భం ఎందుకు పొరపాటు జరిగిందో కొంచెం కూడా ట్రోలర్లు పట్టించుకోలేదు. భారీ జనసందోహం మధ్య జనం చాలా ఎగ్జయిట్ అయి, ఎమోషనల్ గా మాట్లాడేప్పుడు దొర్లిన పొరపాటు అది. ఇప్పుడు -పెద్ది- విజయవాడ ఈవెంట్లోను చరణ్ పొరపాటున మాట జారారు. తన -పెద్ది- నిర్మాత సతీష్ కిలారు సెట్లో మూడు షిఫ్టులు తమతో పాటే ఉండి ఎలా హార్డ్ వర్క్ చేసారో చరణ్ తన మాటల్లో చెప్పారు.. --సెట్ కి వచ్చి ఇలా టీ తాగి అలా వెళ్లిపోయే నిర్మాతలనే చూసాన--ని.. సతీష్ అలాంటి నిర్మాత కాదని కాంప్లిమెంట్ ఇచ్చిన చరణ్ ఫ్లోలో మాట్లాడేప్పుడు నిర్మాతనుద్దేశించి మాట్లాడుతూ -వెన్నుపోటు- అంటూ పదం జారారు. ఆ తర్వాత పెద్ది టీమ్ కు -వెన్నెముక-గా నిలిచారని సరి చేసుకున్నారు.

# ధనుష్ రాజకీయ ఎంట్రీపై దర్శకుడు కామెంట్!



అంతేకాదు ఈ విజయం చూసి అప్పట్లో ఎన్టీఆర్ ని గుర్తు చేసిన వాళ్ళు కూడా లేకపోలేదు. అలా సినిమాలతో సత్తా చాటి ఇటు రాజకీయాల్లో కూడా చక్రం తిప్పుతున్నారు. సినిమా రంగానికి,రాజకీయ రంగానికి మంచి అవినాభావ సంబంధం ఉంది. సినిమాల ద్వారా ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసిన సెలబ్రిటీలు పాలిటిక్స్ లోకి అడుగుపెట్టి ప్రజలకు మంచి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా గత 3,4 సంవత్సరాలుగా పవన్ కళ్యాణ్ , కమల్ హాసన్ లాంటి సినీ సెలబ్రిటీలు ఒకవైపు సినిమాలలో మరొకవైపు రాజకీయాలలో సత్తా చాటుతుంటే.. ఇటీవల కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి కూడా పార్టీ పెట్టిన కొన్ని నెలల్లోనే ఏకంగా తమిళనాడుకి ముఖ్యమంత్రిగా అవతరించి అందరి దృష్టిని ఆకర్షించారు. అంతేకాదు ఈ విజయం చూసి అప్పట్లో ఎన్టీఆర్ ని గుర్తు చేసిన వాళ్ళు కూడా లేకపోలేదు. అలా సినిమాలతో సత్తా చాటి ఇటు రాజకీయాల్లో కూడా చక్రం తిప్పుతున్నారు. నెట్టింట వైరల్‌గా మారిన కెవిన్! ఇలాంటి కొంతమంది సెలబ్రిటీలను ఆదర్శంగా తీసుకొని మరి కొంతమంది సెలబ్రిటీలు రాజకీయ రంగం వైపు అడుగులు వేయడానికి ఆసక్తి కనబరుస్తున్న విషయం తెలిసిందే ఈ క్రమంలోనే కోలీవుడ్ నాట నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా మరింత సక్సెస్ అందుకున్న ధనుష్ కూడా రాజకీయ రంగ ప్రవేశం చేస్తారు అంటూ ఒక వార్త గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న వేళ.. ఈ వార్తలకు మరింత ఆజ్యం పోశారు ఆయన తండ్రి ప్రముఖ దర్శకుడు కస్తూరి రాజా. ఇటీవల ఒక ఈవెంట్ లో పాల్గొన్న కస్తూరి రాజా తన కొడుకు, మనవళ్ళు భవిష్యత్తులో రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. తాజాగా ఒక ఈవెంట్ లో పాల్గొన్న ఆయనకు ధనుష్ పొలిటికల్ ఎంట్రీ పై ఒక ప్రశ్న ఎదురయింది. దానికి ఆయన మాట్లాడుతూ.." ఆసక్తి ఉన్నవారు ఎవరైనా సరే రాజకీయాల్లోకి వెళ్లే హక్కు ఉంటుంది. నా కొడుకు , మనవళ్ళు కూడా ఆ దారిలో వెళ్లొచ్చు" అంటూ తెలిపారు. సీఎం విజయ్ తరహా లోనే ధనుష్ కూడా అభిమాన సంఘాల ద్వారా కొన్నేళ్ళుగా సేవా కార్యక్రమాలు చేస్తున్న విషయం తెలిసిందే. మరి కస్తూరి రాజా చెప్పిన మేరకు ధనుష్ కూడా త్వరలో రాజకీయరంగ ప్రవేశం చేస్తారా అనే కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి. ఇక దీనిపై పూర్తి నిజాలు తెలియాలి అంటే దీనిపై ధనుష్ స్పందించే వరకు ఎదురు చూడాల్సిందే. ధనుష్ విషయానికి వస్తే.. ఈ మధ్యకాలంలో వరుస పెట్టి సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల కుబేర, ఇడ్లీ కడై, తేరే ఇష్క్ మే వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఈయన.. ఇప్పుడు ఇళయరాజా బయోపిక్ తో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అలాగే ధనుష్ 56 సినిమాలో కూడా నటిస్తున్నారు ఈ చిత్రానికి మారి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఏదేమైనా ధనుష్ భాషతో సంబంధం లేకుండా పాన్ ఇండియా భాషలలో సినిమాలు చేస్తూ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంటున్నారు.

# బన్నీ 'రాకా' పై మరో క్రేజీ రూమర్ !


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ' సినిమా 'రాకా' అప్ డేట్ కోసం బన్నీ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐతే, మలయాళ బ్యూటీ ఫెమినా జార్జ్ ఈ సినిమాలో యాక్ట్ చేస్తోంది. ఇప్పటికే ఆమె 'రాకా' యూనిట్ లో చేరింది. వచ్చే షెడ్యూల్ లో ఈ మూవీ టీమ్ లోకి మరో హీరోయిన్ కూడా వచ్చి చేరనుంది. సినిమాలో మంచి ఎమోషన్స్ ఉన్నాయని.. పైగా పాత్రలు కూడా ఎక్కువ ఉన్నాయని.. త్వరలోనే మరో యంగ్ హీరోయిన్ కూడా ఓ ఎమోషనల్ పాత్రలో నటించబోతుందని తెలుస్తోంది. ప్రస్తుతం రాకా షూటింగ్ ముంబయిలో వేసిన ప్రత్యేకమైన సెట్ లో నడుస్తోంది. బన్నీ ఈ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. కాగా భారీ స్థాయిలో, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యాక్షన్ అద్భుతంగా ఉంటుందట. ఈ మూవీలో దీపికా పడుకోణె హీరోయిన్ గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అన్నట్టు ఈ సినిమాలో దీపికా పడుకోణెతో పాటు మృణాల్ ఠా కూర్ కూడా హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే, జాన్వీ కపూర్ కూడా మరో హీరోయిన్ గా నటిస్తోంది.




# పవన్ కళ్యాణ్ బ్యూటీకి గ్లోబల్ రేంజ్..



ఆ దేశ పర్యాటక రంగానికి బ్రాండ్ అంబాసిడర్ గా బాధ్యతలు! పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోయిన్ గా తనకంటూ మరింత పేరు సొంతం చేసుకున్న ప్రియాంక మోహన్ కి తాజాగా గ్లోబల్ స్థాయి గుర్తింపు లభించింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోయిన్ గా తనకంటూ మరింత పేరు సొంతం చేసుకున్న ప్రియాంక మోహన్ కి తాజాగా గ్లోబల్ స్థాయి గుర్తింపు లభించింది. ఆ దేశ పర్యాటక రంగానికి బ్రాండ్ అంబాసిడర్ గా ఆమె బాధ్యతలు స్వీకరించింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా పంచుకోవడంతో సినీ సెలబ్రిటీలు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. దక్షిణ కొరియా పర్యాటక రంగానికి బ్రాండ్ అంబాసిడర్ గా ప్రియాంక మోహన్ ఎంపికయ్యారు. కొరియా టూరిజం ఆర్గనైజేషన్ ఈమెను గౌరవ రాయబారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.సోమవారం సియోల్ లో జరిగిన ఒక అధికారిక కార్యక్రమంలో ప్రియాంక మోహన్ ఈ బాధ్యతలను స్వీకరించారు. కొరియా పర్యాటక శాఖ ప్రెసిడెంట్ పార్క్ సుంగ్ - హ్యూక్ చేతుల మీదుగా ఆమె ఈ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఇక రెండు దేశాల (ఇండియా - కొరియా ) మధ్య పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించడంలో ప్రియాంక నియామకం కీలక పాత్ర పోషిస్తుందని కొరియా టూరిజం ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ గౌరవ అధికారాన్ని స్వీకరించిన తర్వాత ప్రియాంక దీనిపై స్పందిస్తూ.. "ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల కొరియా ప్రభుత్వానికి, కొరియా టూరిజం ఆర్గనైజేషన్ కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. కొరియన్ సంస్కృతి, అక్కడి సంప్రదాయాలు నన్ను ఎప్పుడూ కూడా ఆకట్టుకుంటూనే ఉంటాయి. ముఖ్యంగా భారతీయ ప్రేక్షకులకు కొరియన్ సంస్కృతిని మరింత దగ్గర చేయడానికి నా వంతు కృషి నేను చేస్తాను" అంటూ తన అభిప్రాయాన్ని పంచుకుంది. పైగా ఇందుకు సంబంధించిన ఫోటోలను ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసింది. ప్రియాంక కొరియా టూరిజం ఆర్గనైజేషన్ కి బ్రాండ్ అంబాసిడర్ గా నియమితురాలు అవడంతో అసలు సౌత్ బ్యూటీకి ఆ దేశంలో ఇలాంటి గౌరవమైన అధికారం లభించడమేంటి అంటూ కొంతమంది నెటిజన్స్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా.. అసలు విషయంలోకి వెళ్తే నెట్ ఫ్లిక్స్ లో విడుదలై ఇండో కొరియన్ వెబ్ ఫిలిం మేడ్ ఇన్ కొరియా చిత్రంలో ప్రియాంక ప్రధాన పాత్రలో నటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాతో కొరియన్ ఆడియన్స్ కి కూడా ఈమె దగ్గరయింది.. ఇకపోతే ఈ సినిమాతో పాటు ఓజీ , డాన్, డాక్టర్ , నాని గ్యాంగ్ లీడర్ వంటి చిత్రాలతో ఈమెకు ఉన్న భారీ ఫాలోయింగ్ దృష్టిలో పెట్టుకొని కొరియా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మరి ఈ గౌరవ పదవిలో ప్రియాంక తనను తాను ప్రూవ్ చేసుకొని.. అక్కడి రంగానికి ఆదాయాన్ని ఏ విధంగా తెచ్చిపెడుతుందో చూడాలి. ఇకపోతే ఈ స్థానంలో గతంలో హాలీవుడ్ కొరియన్ స్టార్ నటుడు పార్క్ బో - గమ్ వంటి ప్రముఖులు కొరియా పర్యాటక రంగానికి ప్రాతినిధ్యం వహించగా.. ఇప్పుడు ఆ స్థానంలోకి ప్రియాంక మోహన్ చేరారు





Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555